# “ఇదిగో ... దేవుని గొఱ్ఱెపిల్ల”

# (1:19–51)

“శారా, ప్లెయిన్ అండ్ టాల్” అనే అద్భుతమైన పిల్లల పుస్తకం మెయిన్‌లో ఉన్న ఒక స్త్రీ కథను చెప్పుతుంది. ఆమె తన తీర ప్రాంతాన్ని విడిచి ఉత్తరాల ద్వారా పెండ్లి కుమార్తెగా సిద్ధపడి (మిసిసిపి ప్రాంతంలోని) పచ్చిక బయళ్లలోనికి రావడానికి తీర్మానించు కొంది. వ్యవసాయదారుడైన విధవకు భార్య కాక పూర్వం, ఆమె అతనితోను అతని చిన్న వయస్కులైన కుమారుడు కుమార్తెతోను ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపింది. ఆమె వారికి తన పిల్లిని గూర్చియు, మహా సముద్రాన్ని గూర్చియు చెప్పింది – ఆమె జుట్టు జెడవేయగలదా, పాడగలదా అని వారు అడిగారు. తాను ఎన్నడు కలిసికొనని కుటుంబంలో భాగమవ్వడానికి పశ్చిమ దిశగా ప్రయాణం చేసే సమయం శారాకు ఆసన్నమైనప్పుడు, ఆమె యిలా వ్రాసింది,

> ప్రియమైన యాకోబు గార్కి,
> నేను ట్రెయిన్‌లో వస్తాను. నేను పసుపు రంగు టోపీ పెట్టుకొని యుంటాను. నేను ప్లెయిన్‌గా ఉంటాను, ఎత్తుగా ఉంటాను.
>
> శారా[1]

శారా వచ్చిన రోజున ట్రెయిన్ వద్ద ఆమెను కలిసికోబోతున్నప్పుడు వారు పడిన ఆందోళనను నీవు ఊహించగలవా? వారి మనస్సులో ఏలాటి ఆలోచనలు పోతూ ఉంటాయో? ఆ నాటికలో చిక్కుబడిన నలుగురు ఏమి యెదురు చూడాలో దిక్కుతోచని పరిస్థితిలో నిలిచియుంటారు.

యోహాను 1:19–51 అనే ఈ లేఖన భాగం కూడా అదే అనిశ్చయత, మరియు తారుమారుతో ఆరంభమౌతుంది. ఈ సంభవాలతో చిక్కుకున్న ప్రజలకు ఏదో ఒక గొప్ప విషయంలో అనిశ్చయతలో నిలిచిపోయారు. యేసు ప్రవేశించిన లోకంలోని జనులు ఏదో ఒక దానికొరకు ఆతురతగా వేచియున్నారు; అయితే ఉన్న ఒకే సమస్య ఏమంటే, ప్రజలు దేనికొరకు కనిపెడుతున్నారో ఖచ్చితమైన రూపంలో వారికి తెలియలేదు. పోరాడుతున్న లేక ప్రయాసపడుతున్న సాక్షుల దృష్టి గుండా ఈ నజరేయుడగు యేసు నిజంగా ఎవరో యోహాను సువార్తలోని ఈ భాగం మనకు చూపనారంభించింది.

## బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క సాక్ష్యం (1:19-34)

యొర్దాను నదిలో బాప్తిస్మం పొందడానికి యేసు సమయానికి, యూదయ ప్రాంతంలో

బాప్తిస్మమిచ్చు యోహాను బాగా కలవరం కలిగించాడు. నాజూకు లేని ప్రవక్తవంటి అతని పై ఆకారము, దేవుని రాజ్యము సమీపించియుందని శక్తివంతమైన ప్రవక్తవంటి అతని ప్రకటన, "యెరూషలేమువారును యూదయ వారందరును యొర్దాను నదీ ప్రాంతముల వారందరును" తన వద్దకు వచ్చేలా చేసింది. యోహాను అక్కడ బాప్తిస్మ మిస్తున్నాడు (మత్తయి 3:5). మెస్సీయా తన అనుచరులను అరణ్యంలో సమకూర్చుతాడని ఎదురు చూచిన కారణాన కాబోలు[2] బాప్తిస్మమిచ్చు యోహాను నిజంగా ఏమైయుండవచ్చో జనులు ఊహించ మొదలుపెట్టారు. ఆ కుతూహలం అధికమైనప్పుడు, నీవెవడవని అడగడానికి యెరూషలేమునుండి యూదులు[3] యాజకులను లేవీయులను యోహాను వద్దకు పంపారు (1:19).

తన బోధయందేమి సంభాషణలోనేమి బాప్తిస్మమిచ్చు యోహాను మోమాటము లేనివాడై తన సందేశంలో ఏ సందేహాన్నీ మిగల్చలేదు. "నేను క్రీస్తును కాను" అని అతడు యెరూషలేమునుండి వచ్చిన మనుష్యులకు తెలియజేశాడు (1:20). పైగా, తాను ఏలీయాను[4] కానని లేక మోషేచే ప్రవచింపబడిన ప్రవక్తను కానని కూడా తెలిపాడు (1:21; ద్వితీయో. 18:15 చూడు). సంక్షిప్తంగా చెప్పాలంటే, వారు ఎవరి కొరకు వేచియున్నారో తాను ఆయనను కాదు అని అతడు స్పష్టంగా వినిపించాడు. అయితే, అతడు యెషయా 40:3నుండి ఎత్తి చూపుతూ, "నేను ప్రభువు త్రోవ సరాళముచేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని" తన్ను గుర్తింప చేసికొన్నాడు (1:23). అతడు కేవలం ఒక వర్తమానికుడును, ముందుగా వచ్చినవాడునై ఉన్నాడు. యోహాను వెనుక ఒకడు వస్తున్నాడు, ఆయన చెప్పుల వారును విప్పడానికి కూడా తాను పాత్రుడు కానట్టు యోహాను చెప్పుకున్నాడు.

తన పనికి కాదు గాని, యోహాను తన మాటకు అతడు నమ్మకస్థుడైయున్నాడు. మరునాడు, యేసు తన వద్దకు వచ్చినప్పుడు యోహాను – "ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని ప్రకటించాడు (1:29). యేసు బాప్తిస్మం పొందినట్టు యోహానులో దాఖలు చేయబడకపోయినా, "ఆత్మ పావురమువలె ఆకాశమునుండి దిగివచ్చుట చూచితిని; ఆ ఆత్మ ఆయన మీద నిలిచెను" అని అతడు సూచించడంలో బాప్తిస్మమిచ్చు యోహాను దానిని సూచించాడు (1:32). "ఈయనే దేవుని కుమారుడని" తాను తెలిసికొనినట్టును అతడు సాక్ష్యమిచ్చాడు (1:34). బాప్తిస్మమిచ్చు యోహాను దృష్టిలో యేసు దేవుని ఒక కుమారుడు కాదు; ఆయనే దేవుని కుమారుడు. ఆయన దేవుని ఒక గొఱ్ఱెపిల్ల కాదు, ఆయనే దేవుని గొఱ్ఱెపిల్ల.

## అంద్రెయ యొక్క సాక్ష్యం (1:35-42)

మరునాడు యోహాను మరల యేసును సూచించి, "ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల" (1:36) అని తన శిష్యులతో చెప్పాడు. గనుక వారు యోహానును విడిచి యేసును వెంబడించారు. వారిలో ఒకడైన అంద్రెయ[-] యేసును "బోధకుడా" అని పిలుస్తూ (1:38) విద్యార్థి – ఉపాధ్యాయుల సంబంధానికి సిద్ధమైయున్నట్టు సూచించాడు. ఏదియెలాగున్నా, అతడు

ఆయనను వెంబడించడంలోగల కారణం, ప్రభువైన యేసు యొక్క జ్ఞానంచేత ఒప్పింపబడిన దానికంటె యింకను లోతుగనే ఉంది. అతడు వెంటనే తన సహోదరుడైన సీమోను పేతురును చూచి, "మేము మెస్సీయాను కనుగొంటిమని" చెప్పాడు (1:41). ఇప్పటివరకు ఈ లేఖన భాగంలో, యేసు – దేవుని గొఱ్ఱెపిల్లయని, దేవుని కుమారుడని, రబ్బీ అని, మెస్సీయ అని ప్రకటింపబడ్డాడు.

## ఫిలిప్పు, నతనయేలుల సాక్ష్యం (1:43-49)

"నన్ను వెంబడించుమని" జీవితాన్ని మార్చే మాటలతో యేసు ఫిలిప్పును పిలిచాడు (1:43). ఫిలిప్పు నతనయేలును కనుగొని – ధర్మశాస్త్రములో మోషేయు ప్రవక్తలును ఎవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి; ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని తెలిపాడు (1:45). అందుకు నతనయేలు, "నజరేతులోనుండి మంచిదేదైన రాగలదా?" అంటూ నిరుత్సాహంగాను తప్పులెన్నుతూనూ ప్రశ్నించాడు (1:46). అతడు ఒప్పింపబడకపోయినా, యేసును దర్శించడానికి నతనయేలు ఫిలిప్పుతో వెళ్లాడు. నతనయేలు తన వద్దకు వస్తూ ఉండగా, "–ఇదిగో యితడు నిజముగా ఇశ్రాయేలీయుడు, ఇతనియందు ఏ కపటమును లేదని" ప్రభువైన యేసు అతని గూర్చి చెప్పాడు (1:47). నతనయేలు ఆశ్చర్యపోయి, తనను గూర్చి ఆయనకు ఎలా తెలుసో అడిగాడు. "–ఫిలిప్పు నిన్ను పిలువక మునుపే, నీవు ఆ అంజూరపు చెట్టు క్రింద ఉన్నప్పుడే నిన్ను చూచితినని అతనితో" ప్రభువు అన్నప్పుడు నతనియేలు తన వ్యక్తిత్వమంతటితో కదిలింపబడ్డాడు (1:48). నతనయేలు ఆ అంజూరపు చెట్టు క్రింద ధ్యానిస్తున్నాడో, లేక ప్రార్థిస్తున్నాడో మరియు నతనయేలు యొక్క హృదయపు అంతరంగ తలంపులను ఆయన ఎరిగినట్లు ప్రభువు మాటలు సూచించియుండవచ్చు. అతని మార్పుకు కారణమేమైయున్నా, తప్పులు వెదకే కఠినాత్మునినుండి ఉత్సాహపూరితుడైన శిష్యుడయ్యేలా నతనయేలు వెంటనే రూపాంతరం పొందాడు. "(రబ్బీ) బోధకుడా, నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువు" అని మూలాధారమగు ఒప్పుకోలును అతడు చేశాడు (1:49).

ప్రభువైన యేసుకును, సాక్షులకును మధ్య జరిగిన ఈ మొదటి సంధింపులో, ఆయనను గూర్చి వారు ఏమని నమ్మ వచ్చారో వర్ణించడానికి, ప్రజలు మాటలను తడువు కొంటున్నట్టు కన్పిస్తారు. వారి వద్ద కేవలం సీమ సున్నపు పెన్సిళ్లు అయిదే అయిదు ఉండగా, బహు రమ్యమైన సూర్యాస్తమయపు చిత్రానికి రంగులు వేయ ప్రయత్నించి నట్టున్నారు ("గొఱ్ఱెపిల్ల," "దేవుని కుమారుడు," "రబ్బీ," "మెస్సీయ," "రాజు"). తాము చూచిన ప్రకాశాన్ని వర్ణించడంలో వారిలో ఎవడును న్యాయం చేకూర్చలేకపోయారు! అతి ప్రాముఖ్యమైన ఒప్పుకోలు యింకా రావలసియుంది, తానెవరో తన సొంత మాటల్లో ప్రభువు తానే తరువాత తెలియజేస్తాడు (4:26).

## యేసు యొక్క సాక్ష్యం (1:50, 51)

ఫిలిప్పు తనను పిలువక ముందు ఆ అంజూరపు చెట్టు క్రింద తానుండగనే అతన్ని చూచినట్లు యేసు నతనయేలుకు చెప్పిన తోడనే అతని స్రవించిన ప్రత్యుత్తరానికి యేసు కొంతమట్టుకు ఆశ్చర్యపడినట్లు కన్పిస్తాడు. అంతకంటెను ఎక్కువగా ఒప్పించే సూచక క్రియలను అతడు చూడబోతాడని ప్రభువు అతనికి తెలుపుతూ యిలాగన్నాడు: "మీరు ఆకాశము తెరవబడుటయు, దేవుని దూతలు మనుష్యకుమారునిపైగా ఎక్కుటయును దిగుటయును చూతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (1:51). ఆకాశము తెరువబడుతుందని ఆయన చెప్పాడు: గ్రీకులో ఉపయోగింపబడిన అమరికను బట్టి (సంపూర్ణ అసమాపక క్రియ) ఆకాశము తెరవబడి, తెరవబడునట్లు ఉండిపోతుంది. అది తెరవబడినట్లు నిలిచియుంటుంది. పరలోకానికి భూమికి మధ్యగల సంబంధం నిరంతరం తాను మార్పు చేయబోతున్నట్లు నజరేయుడగు యేసు చెప్పుకొంటున్నాడు! పరలోకం యొక్క క్షణిక దర్శనాన్ని యేసు నతనయేలుకు వాగ్దానం చేయలేదు. తనయందు పరలోకపు మహిమ బయలుపరచబడుతుందని ఆయన చెప్పుకున్నాడు. సువార్త రచనల్లో తనకు నచ్చిన స్వయం – వర్ణన అదే. ఈ మనోహరమైన సూక్తికి సంపన్నమైన పాత నిబంధన పూర్వ చరిత్ర ఉంది. యేసు దానిని ఉపయోగించింది ఎందుకైయుండ వచ్చునంటే – తన కాలంలో అపార్థం చేయబడిన పాత నిబంధన భాషా ప్రయోగం అదే మాదిరి కన్పిస్తుంది. "మెస్సీయ" మరియు "ఇశ్రాయేలు రాజు" అనే రెండింటికి సైనిక సంబంధమైన అర్థం ఉంది, వాటిని ఆయన తనకు వర్తింపజేసికొన బూనలేదు. మిగిలిన వర్ణనలన్నీ నజరేయుడగు యేసు ఎవరు, తాను ఏమి చేయవచ్చాడు అనేవాటిని గూర్చిన పాక్షిక వర్ణనలు మాత్రమే. అందును బట్టి, యేసు "మనుష్యకుమారుడని" తన్ను తాను పిలుచుకున్నాడు. ఈ ప్రయోగం ఆయన దేవత్వాన్ని ఆయన మానవత్వాన్ని ఒక్కసారే సూచిస్తుంది. ప్రవక్తలు ఎవరిని గూర్చి సూచించారో ఆయన తానే అయ్యున్నట్టి భావనను లేక ఉద్దేశాన్ని యేసు అందులో కనుపరచాడు. అదే సమయంలో, తన సొంత పదజాలంలో తన్ను గుర్తింపజేసికొనడానికి ఆయన అవకాశాన్ని కల్పించుకున్నాడు.

## ముగింపు

"వీటికంటె గొప్ప కార్యములను చూతువు" అనే మాటలు – యోహాను సువార్త యొక్క ఆరంభంలో నిలిచియున్న మనకు కూడా వర్తిస్తాయి. అనేక సంవత్సరాలుగా ప్రభువైన యేసును మనము ఎరిగియున్నా, వీటికంటె గొప్ప సంగతులను మనం చూస్తాం. ఆరు వారాల వయస్సునుండి మనం బైబిలు తరగతులకు పోయి ఉన్నవారమైనా, వీటికంటె గొప్ప సంగతులను మనం చూస్తాం. క్రైస్తవ కళాశాలనుండి బైబిలు డిగ్రీలు పొందిన వారమైనా, వీటికంటె గొప్ప సంగతులను మనం చూస్తాం. నజరేయుడైన యేసువైపు మనం తేరి చూచిన ప్రతిసారి, పరలోకం తెరవబడియున్నట్లు మనం చూస్తాం.

ఏ బాంధవ్యంలోనైనా ఉన్న మహా గొప్ప అపాయమేమంటే – ఆ వ్యక్తిని గూర్చి తెలిసికొనడం మానివేయడమే. ఒక వ్యక్తిని "వెలుపల – లోపల" ఎరిగినానని తలంచు

కొనడం, అనాగరికమైన మేల్కొలుపు దిశగా వెళ్లడమే! ఏ బాంధవ్య జీవితమైనా ఒకరి నొకరు ఎరుగుటలో కొనసాగడమే. తమ జీవితమంతా ఒకరినొకరు ఎరిగిన ప్రజలైనా, ఏభై సంవత్సరాలు వివాహితులుగా ఉన్న భార్యాభర్తలైనా ఒకరిని గూర్చి మరొకరు ఎరుగవలసింది ఎంతో ఉంటుంది. ప్రభువైన యేసును గూర్చి నీవు ఆ విధంగా భావిస్తున్నావా?

మన వద్దనున్న సుద్ద ముక్క రంగుల పెట్టి బహు చిన్నదని మనం చదివిన లేఖన భాగం మనకు జ్ఞాపకం చేస్తుంది: ప్రభువైన యేసును నిర్వచించే వర్గాలు ఎల్లప్పుడు చాలనివయ్యే ఉంటాయి. దీన్ని గమనించు నీవాయనను వెదుకుట కొనసాగిస్తున్నావా? ఆయన నిన్ను ఆశ్చర్యచకితునిగా చేయనిస్తావా? ఆయనను గూర్చి పఠించడంలో కొనసాగిస్తూ, సౌకర్యంతో కూడిన నీ ఊహల విషయంలో నిన్ను గద్దించుతూ, సవాలు చేస్తూ ఉండనిస్తావా? ఆయన ఏమైయుండాలని నీవు తలంచావో ఆ నీ భావాలకు ఆయన సరిపోయేలా చూస్తున్నావా లేక తన పలుకులలోను కార్యాలలోను యేసు తన్ను తాను నిర్వచించుకొనేలా ఎదురు చూస్తున్నావా? జీవితంలో నేడు నీవు ఎవరివైయున్నా, ఈ సువార్త రచనలో నీవు యేసును వెదుకుట కొనసాగించినట్టయితే, "నీవు వీటికంటె గొప్ప కార్యాలను చూస్తావు."

యేసు ఫిలిప్పును పిలిచినప్పుడు, కేవలం "నన్ను వెంబడించుము" అని మాత్రమే చెప్పాడు. ఫిలిప్పు జీవితంలో ఆ సమయానికి, యేసును గూర్చి అతడు గ్రహింపనిది ఎంతో ఉంది, మరియు అతడు అర్థం చేసికోగలిగింది చాల తక్కువ. అయినను, అతడు ఆయనను వెంబడించాడు, అలా వెంబడించడంలో, యేసు ఎవరైయున్నాడో క్రమేణా చూడగలిగాడు. మనము కూడా యేసును గ్రహించగోరితే, మనం ఆయనను వెంబడించ నిష్టపడాలి; అలా వెంబడించడంవలన మనం అర్థం చేసికోగలుగుతాం.

---

సూచనలు

[1]Patricia MacLachlan, *Sarah, Plain and Tall* (New York: Harper Trophy, 1985), 15. [2]అపొ. 21:38 చూడు. [3]ఈ సువార్తనుండి ప్రసంగించేటప్పుడు, "యూదులు" అనే పదాన్ని జాగ్రత్తగా నిర్వచించాలి. వాస్తవంగా, అది జాతియంతటిని ఉద్దేశించి చెప్పబడింది కాదు. ఎందుకంటే, యేసును, ఆయన శిష్యులును యూదులే గదా. యూదులంటే, యెరూషలేములో ఉన్న యూదుల నాయకులని నిర్వచింపవచ్చు. తిరుగుబాటు చేయునట్టు ఏ ప్రవక్తయైనా జనులను పురికొల్పితే అధికంగా నష్టపోయేది వారే. [4]మలాకీ 4:5 చూడు. మలాకీలో చెప్పబడిన ఏలీయా బాప్తిస్మమిచ్చు యోహానేయని ప్రభువైన యేసు మత్తయి 11:14లో చెప్పాడు. తన్ను గూర్చి ప్రభువు చెప్పిన దానిని బాప్తిస్మమిచ్చు యోహాను ఖండించడం లేదు. కాని పాత నిబంధనలోని ప్రవక్తయైన ఏలీయా అక్షరార్థంగా లేచాడనే అక్షరార్థమైన భావాన్ని అతడు నిరాకరించాడు. అతడు మృతులలోనుండి లేచిన ఏలీయా కాదు. [5]సువార్త రచనలలో అంద్రెయ నెమ్మదియైన శీలము గలవాడైనట్టు చిత్రింపబడ్డాడు; అయినా యోహాను సువార్తలో అతడు ప్రత్యక్షమైన మూడు సార్లులో ప్రతిసారి అతడు ఎవరో ఒకరిని ప్రభువు వద్దకు నడిపిస్తున్నట్టు కన్పిస్తాడు. మొదట పేతురును (1:41, 42), తరువాత అయిదు రొట్టెలు రెండు చిన్న చేపలు కలిగియున్న బాలుని (6:8, 9), చివరిగా గ్రీసు దేశస్తులను (12:20–23).